క్లుప్తంగా

ఇంకుడుగుంటకు భూమి పూజ



గుడివాడ టౌన్(నందివాడ): ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని భద్రపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో రూ. 55 వేలతో నిర్మిస్తున్న ఇంకుడుగుంట పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాజాబాబు మాట్లాడుతూ నీటిని వృథాగా వాడవద్దని సూచించారు. నీటి నిల్వలు పెరిగేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, తహసీల్దార్ వి.భావన్నారాయణ, ఎంపీడీఓ వీఎస్ నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

పమిడిముక్కల: మండలంలోని రైతులందరూ రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి గణేష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 30వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు. ఈ–పంట నమోదు, ఈకేవైసీ పూర్తి చేసిన రైతులకు మాత్రమే ధాన్యం కొనుగోలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, రైతు భరోసా పథకాలు అందుతాయని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు.

విద్యుత్ లైట్ల ఏర్పాటు

మండవల్లి: మండల కేంద్రంలో పనిచేయని విద్యుత్ లైట్ల స్థానంలో కొత్త బల్బులను సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వీధుల్లో కాంతులు విరజిమ్మే విధంగా లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు


గుడివాడ టౌన్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అక్టోబర్ 1వ తేదీ నుంచి రెండు నెలలు సోలార్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణలో పాల్గొనదలచిన వారు 10వ తరగతి లేదా ఐటీఐ లేదా డిప్లమో పూర్తిచేసి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9848819682, 9666654641ను సంప్రదించాలన్నారు.

పశువులకు మెరుగైన వైద్యం



గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణకు పెద్దపీట వేస్తుందని కృష్ణా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసరావు అన్నారు. ఏరియా పశువైద్యశాల పరిధిలోని పశు వైద్యులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే వాటి వలన రైతు ఫలితాలు పొందుతారని చెప్పారు. అందుకు కావాల్సిన మందులు, ఇతర వసతులు కల్పిస్తున్నందున వాటిని సక్రమంగా పశువులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశు పోషకులకు పరిజ్ఞానాన్ని పెంపొందించే విషయంలో కూడా డాక్టర్లు చొరవ చూపాలని సూచించారు. అన్ని సీజన్‌లకు కావాల్సిన వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కాలానుగుణంగా వాటిని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి ఏడీ డాక్టర్ జీవీ నరసింహారావు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, జాషువాకు నివాళి



గుడివాడ టౌన్: దేశ స్వాతంత్య్రం కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టిన గొప్ప వ్యక్తి భగత్ సింగ్ అని ఎస్‌పీఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు టీఎంఈ రాణి అన్నారు. ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్లో బుధవారం భగత్ సింగ్, విశ్వకవి సామ్రాట్ గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకుని దేశ, సమాజసేవకు సంసిద్ధులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్ సమీర్, రాజు, నవీన్, గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనోత్సవాలు



గుడివాడలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పామర్రు: గణపతి నవరాత్రులను పూర్తి చేసుకున్న పలు చలువ పందిళ్లలోని వినాయకస్వాములను బుధవారం గ్రామోత్సవాల అనంతరం నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. స్థానిక బాపూజీ పేటలోని గౌడ యువత ఆధ్వర్యంలో వినాయకస్వామికి నవరాత్రులు పూజలను ఘనంగా చేసి అనంతరం స్వామిని గ్రామోత్సవం చేశారు. అంగరంగ వైభవంగా మేళ తాళాలతో కనకతప్పెట్లు, డప్పు వాయిద్యాలతో బాణసంచా కాల్చుతూ ఊరేగింపు నిర్వహించారు. బాపూజీ పేట నుంచి నాలుగురోడ్ల కూడలి మీదుగా విజయవాడరోడ్డు, మచిలీపట్నం రోడ్డు, చల్లపల్లి రోడ్డులలో స్వామిని ఊరేగించి అనంతరం స్థానిక పుల్లేరు కాలువలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, పరసా కిషోర్, ఆరేపల్లి రాకేష్, ఆరేపల్లి రాంబాబు, వీరంకి నాగ ప్రసాద్, ఆరేపల్లి గోపి, ఈడే శోభన్, పరసా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కోటిరెడ్డిపేటలో వినాయక స్వామిని ఊరేగించారు. మండల పరిధి రాపర్ల గ్రామంలో వినాయకస్వామిని గ్రామోత్సవం నిర్వహించి అనంతరం స్థానిక కాలువలో స్వామిని నిమజ్జనం చేశారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు

గణపతి నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు బుధవారం పలు చోట్ల స్వామివార్లకు విశేషంగా పూజలు చేశారు. మండల పరిధి జమీదగ్గుమిల్లి గ్రామంలోని వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శత సహస్ర నామాలతో పలు రకాల పుష్పాలతో స్వామిని పూజించారు. స్వామి వారి సన్నిధిలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. రాపర్ల గ్రామంలోని వినాయక స్వామి మందిరంలో భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక విజయవాడ రోడ్డులోని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన 31 అడుగుల మట్టి వినాయకస్వామికి విశేష పూజలు చేశారు. వచ్చిన భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కురుమద్దాలి, కనుమూరు, అడ్డాడ తదితర గ్రామాలలోని చలువ పందిళ్లలో స్వామికి విశేషంగా పూజలను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో స్వామిని కొలిచారు.



కపిలేశ్వరపురం లంకతోటలో వినాయకుడి ఊరేగింపు

భారీగా గణపతి నిమజ్జనాలు

గుడివాడ టౌన్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలోని వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. తీన్మార్ డప్పులు, యువత చిందులు, రంగులు చల్లుకుంటూ భక్తులు స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. పురవీధుల నుంచి విగ్రహాలను స్థానిక పామర్రు రోడ్‌లోని పెద్ద కాల్వలో నిమజ్జనం చేశారు.



పామర్రులో గౌడ యువత ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా గణేష్ నిమజ్జనం

పమిడిముక్కల: మండలంలో గణపతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కపిలేశ్వరపురం లంక తోటలో గత తొమ్మిది రోజులుగా వైభవంగా పూజలు నిర్వహించారు. స్వామి వారిని బుధవారం భారీ ఊరేగింపు, తీన్మార్ డప్పులు, డీజే సౌండ్స్‌తో గ్రామంలో ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకొంటూ, డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న బందర్ కాలువలో నిమజ్జనం చేశారు.

కైకలూరు: వినాయక చవితి ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉత్సాహంగా బుధవారం నిర్వహించారు. తీన్మార్ డప్పులు, శక్తివేశాలు, బాణాసంచాలతో విఘ్నేశ్వర విగ్రహాలను ఊరేగించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) నివాసం వద్ద ఏర్పాటు చేసిన చవితి పందిరి వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. వందలాది మంది భక్తులు స్వామి ప్రసాదాలను స్వీకరించారు. కోరుకొల్లు రోడ్ టీఎస్ఆర్ టవర్స్‌లో తానా ప్రసాద్ ఆధ్వర్యంలో 200 మందికి అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అద్దంకి వెంకట శ్రీనివాసరావు, బాపిరాజు, కోటేశ్వరరావు, విష్ణుమోహనరావు, గోవిందరాజులు పాల్గొన్నారు.

గణపతి పూజలో ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో ఎమ్మెల్యే శ్రీ వెంకటేశ్వరరావు(నాని) పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ గణపతి స్వామి కరుణా కటాక్షాలు గుడివాడ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని కోరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలేటి చంటి, కె.ఆంజనేయ ప్రసాదు, చుండూరి శేఖర్, మహిళా కార్యకర్తలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

ఎలుకల నిర్మూలనతో అధిక దిగుబడులు

మండవల్లి: వరి పంటకు నష్టం కలిగించే ఎలుకల నిర్మూలన చేపడితేనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ జి.వెంకటమణి తెలిపారు. మండవల్లి రైతు భరోసా కేంద్రంలో రైతులకు బుధవారం ఎలుకల నిర్మూలనపై అవగాహన సదస్సు, ఎలుకలు నిర్మూలించే పద్ధతులు, మందు తయారీ, ఎలుకల మందు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లోని ఆర్బీకేల ద్వారా బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. మండవల్లి మండలానికి 25 కేజీల బ్రోమోడయోలిన్ మందు ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. కార్యక్రమాన్ని రైతులంతా ఒకేసారి చేపట్టాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, వీఏఏ షేక్ సుభాని, ప్రకృతి వ్యవసాయ సీహెచ్‌వీ రామారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్ : ఖరీఫ్ వరి సాగులో ఎలుకల నిర్మూలనతో పంట నష్టాన్ని నివారించుకోవచ్చని మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. ముదినేపల్లి మండలం దాకరంలో సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. వ్యవసాయాధికారి బి. వేణుమాధవ్ మందు తయారీ, వినియోగించే విధానాన్ని వివరించారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రం వద్ద ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న ఏడీఏ వెంకటమణి

కైకలూరు: రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం ద్వారా ఉత్తమ ఫలితాలు పొందుతారని ఏరువాక, ఏలూరు కేంద్రం శాస్త్రవేత్తలు కె.ఫణికుమార్, టి.సుజాత అన్నారు. వేమవరప్పాడు గ్రామంలో వరి, అపరాలసాగుపై రైతులకు శిక్షణ బుధవారం అందించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ 96 శాతం నూకలు, 21 శాతం నూనె, 2 శాతం బ్రోమోడయోలిన్‌లో మందును తయారు చేయాలన్నారు. ప్రతీ ఎకరలో 10 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి ఉంచాలన్నారు. వరి పొట్టదశ నుంచి ఈత దశలో ఉన్నందున రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నున్న రాంబాబు, ఉప సర్పంచ్ రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏడీఏ గంగాధరరావు, ఈఓ దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి

కైకలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కైకలూరు మండలాన్ని మొదటి స్థానంలో నిలపాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. శీతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఎంపీపీ అధ్యక్షన అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో మొదటి స్థానంలో నిలించిందన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉన్నత స్థానంలో నిలపాలని కోరారు. పీహెచ్‌సీలకు వస్తోన్న రోగుల పట్ల ప్రేమతో వ్యవహరించి స్వస్థత చేకూర్చాలని వైద్య సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వివిధ గ్రామాల సర్పంచులు చంద్రా పద్మావతి, ఉప్పాల నాగమణి, ఉలిసి వసంతకుమారి, అల్లూరి మంగారావు, నున్న రాంబాబు, మరియమ్మ, వైద్యాధికారులు హేమలత, అన్నపూర్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

తోట్లవల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తోట్లవల్లూరు మండలంలో ఈ నెల 30 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ తుంగల స్వర్ణలత తెలిపారు. 30న చాగంటిపాడు, అక్టోబర్ 3న దేవరపల్లి, 4 భద్రిరాజుపాలెం, 6 గరికపర్రు, 7 ఐలూరు, 9 పాములలంక, 10 పెనమకూరు, 11 రొయ్యూరు, 12 తోట్లవల్లూరు, 13 వల్లూరుపాలెం, 14 యాకమూరు, 17 బొడ్డపాడు గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



శీతనపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అడవి కృష్ణ

3 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

మొవ్వ: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను అక్టోబర్ 3వ తేదీ నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిడుమోలు, మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమ షెడ్యూల్‌ని వైద్యాధికారులు బుధవారం తెలియచేశారు. నిడుమోలు పీహెచ్‌సీ పరిధిలో 3వ తేదీ అవురుపూడి, 6వ తేదీ మంత్రిపాలెం, 10వ తేదీ కాజ–1, 20వ తేది పెదముత్తేవి. 21 తేది కాజ–2, 24వ తేది చినముత్తేవి సచివాలయాల్లో మొవ్వ పీహెచ్‌సీ పరిధిలో 4వ తేదీ కూచిపూడిలో, 7వ తేదీ పెదసనగల్లు, 9వ తేదీ అయ్యంకి, 12వ తేదీ కోసూరు, 13వ తేదీ పెదపూడి, 16వ తేదీ వేములమడ, 17వ తేదీ మొవ్వ, 19వ తేది భట్లపెనుమర్రు సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ముదినేపల్లి రూరల్ : మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండో రోజు బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. వడాలి జెడ్పీ హైస్కూల్లో ఇంగ్లిషు, లెక్కలు సబ్జెక్టులకు సంబంధించి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు సమావేశం ఏర్పాటుచేశారు. సోషల్ సబ్జెక్టుకు సంబంధించి పెదపాలపర్రు జెడ్పీ హైస్కూల్లో సమావేశం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లు ఆయా సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధనలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. కాంప్లెక్స్ చైర్మన్లు వి.ప్రభుదాసు, జె.శాంతకుమారి పర్యవేక్షించారు.

జూనియర్ కాలేజీలో తల్లిదండ్రుల సమావేశం

కైకలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తల్లిదండ్రుల సమావేశం ప్రిన్సిపాల్ ఎస్.రవీంద్ర ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జగనన్న నాడు – నేడు, విద్యా దీవెన, అమ్మఒడి వంటి పథకాలపై సమీక్షించారు. విద్యావ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమూలంగా మార్పు చేశారని పలువురు తల్లిదండ్రులు చెప్పారు. విద్యార్థులు వారి అభిప్రాయాలను వెల్లండించారు. ప్రభుత్వ కాలేజీలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఏవీ రాజశేఖర్, జయలక్ష్మి, సాధిక్ హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు స్వామి వారి నిమజ్జనం

గుడివాడ టౌన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జన కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. తొలుత భారీ అన్న సమారాధన అనంతరం స్వామి వారి నిమజ్జనం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పాల్గొంటారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.మోహన్‌రెడ్డి

గుడివాడరూరల్: రాష్ట్రంలో పోలీసుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన డైరెక్టర్ ఎన్.మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యాలయంలో బుధవారం డీఎస్పీ పి.శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి సత్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అత్యాధునిక వసతులతో నూతన పోలీస్ స్టేషన్‌ల భవన నిర్మాణాలు, క్వార్టర్స్‌ల నిర్మాణాలు ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. గుడివాడలో డీఎస్పీ నూతన కార్యాలయాన్ని నిర్మించడం జరిగిందన్నారు. రూరల్ సీఐ సొంత కార్యాలయ నిర్మాణానికి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చొరవతో స్థలాన్ని సేకరిస్తామని పేర్కొన్నారు. భవన నిర్మాణం త్వరలోనే మొదలు పెడతారని తెలిపారు. పోలీసుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని మోహన్‌రెడ్డి చెప్పారు.



డీఎస్పీ పి.శ్రీకాంత్‌కు మొక్క అందజేస్తున్న మోహన్‌రెడ్డి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పమిడిముక్కల: కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన అండర్–14, అండర్–17 బాలికల కబడ్డీ ఎంపికల్లో అగినపర్రు జెడ్పీ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటలకు ఎంపికయ్యారు. పి.చంద్రకళ, వి.జయశ్రీ, కె.హాసిని నియోజకవర్గస్థాయిలో ఎంపికై జిల్లా జట్టు తరపున రాష్ట్రస్థాయిలో ఆడతారని హెచ్ఎం ఫణి కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన ఇన్‌చార్జి పీడీ రవికుమార్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పసుమర్రు(పామర్రు): జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించే కబడ్డీ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థిని ఎంపిక అయిందని పసుమర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎం.రాణి తెలిపారు. పసుమర్రు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో విజేత అయిన విద్యార్థిని బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన వల్లూరుపాలెంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి కబడ్డీ సెలక్షన్స్‌లలో తమ హైస్కూల్ విద్యార్థిని కుంపటి దివ్య అండర్–14 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి నియోజకవర్గ టీమ్‌కు ఎంపికైందన్నారు. త్వరలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత పొందిందని పేర్కొన్నారు. దివ్యను, ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీ ఎ.జవహర్‌బాబును అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం ఫణికుమార్

సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

జమీదగ్గుమిల్లి(పామర్రు): ప్రతి ఒక్క ఇంటికి ఉచితంగా సర్వే నిర్వహించి సర్టిఫికెట్‌లు అందజేసే ప్రభుత్వ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. గ్రామంలో ఇంటింటికి సర్వే కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సర్వే అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి వారి సరిహద్దులను కొలిచి వారి స్థలాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని చెప్పారు. గ్రామంలోని 180 నివాస గృహాలకు ఈ సర్వే నిర్వహిస్తారన్నారు. సర్వే పూర్తయిన తర్వాత సంబంధిత లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తారని చెప్పారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వే కార్యక్రమానికి గ్రామస్తులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, గ్రామ సర్పంచ్ కూనపరెడ్డి చంద్రశేఖర్‌రావు, గ్రామ కార్యదర్శి జ్యోతి కృష్ణ, సర్వేయర్ విజయ్, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



జమీదగ్గుమిల్లిలో ఇంటింటి సర్వేలను పరిశీలిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

చిరు ధాన్యాల్లో పోషక విలువలు అధికం

ఐసీడీఎస్ సీడీపీఓ భానుశ్రీ

పమిడిముక్కల: చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని ఐసీడీఎస్ సీడీపీఓ వి.భానుశ్రీ తెలిపారు. తాడంకి అంగనవాడీ కేంద్రంలో బుధవారం కపిలేశ్వరపురం సెక్టార్ మొత్తం కలిపి పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. భానుశ్రీ తక్కువ ఖర్చుతో ఎక్కువ విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. అంగనవాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉషారాణి, సెక్టార్ పరిధిలోని అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కృష్ణాపురం అంగనవాడీ కేంద్రంలో సెక్టార్ మొత్తం కలిపి పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అంగనవాడీ కార్యకర్తలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన వంటలు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరంకి బలుసలమ్మ, వైస్ ఎంపీపీ గంజాల సీతారామయ్య, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.



తాడంకిలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ భానుశ్రీ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు

గుడివాడ టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సొంతిల్లు మంజూరు చేస్తుందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో మంగళవారం టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు తాళాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎక్కడా నిర్మించనన్ని పెద్ద మొత్తంలో టిడ్కో గృహాలు గుడివాడలో ఏర్పాటు చేసిన ఘనత ఎమ్మెల్యే కొడాలి నానీకే దక్కుతుందన్నారు. మహనేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన 77 ఎకరాల స్థలంలో 8,912 గృహాలను నిర్మించి అంచలంచెలుగా లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేస్తున్నామన్నారు. పూర్తి సౌకర్యాలతో ఏర్పాటు చేసిన 440 గృహాలకు సంబంధించి తాళాలు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు వెంపల అప్పారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వై రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఇంటి పత్రాలు పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు

30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

ముదినేపల్లి రూరల్ : ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులుకాని విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024 మార్చిలో నిర్వహించే పరీక్షలకు హాజరుకావచ్చని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జాస్మిన్ బుధవారం తెలిపారు. ఈ నెల 30లోగా పరీక్ష ఫీజు కళాశాలలో చెల్లించాలని, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, చివరిసారి పరీక్షలు రాసిన ఇంటర్‌మార్కుల జాబితా అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

కష్టంతో కాకుండా ఇష్టంగా చదవండి



గుడివాడ టౌన్(నందివాడ): పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే ఇష్టపడి చదవాలని కృష్ణా జిల్లా డీఈఓ తాహెరా సుల్తానా తెలిపారు. నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఆమె 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ వయస్సులో కష్టపడిన వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. కష్టపడి చదివిన వారు ఉన్నత స్థితిలో ఉంటే చదవని వారు కష్టపడి పనిచేయాల్సి వస్తుందన్నారు. దీనిని గుర్తించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు 10వ తరగతి విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి వారికి సరైన శిక్షణ అందించాలని సూచించారు. అవసరమైతే ఉదయం, సాయంత్రం కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవైఈఓ వెంకట పద్మారాణి, ప్రధానోపాధ్యాయుడు పి. రవికుమార్, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.